ప్రజాశక్తి
ఆదివారం 24 నవంబరు, 2024
5
శ్రీకాకుళం

ఎక్కువ కేసులు రాజీకి కృషి

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా వ్యాప్తంగా వివిధ కోర్టుల్లో రాజీ చేసేందుకు డిసెంబరు 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ చక్కటి అవకాశమని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. ఈ మేరకు జిల్లా కోర్టు నుంచి స్థానిక కోర్టుల న్యాయమూర్తులతో ఆన్‌లైన్ శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ అవకాశాన్ని న్యాయవాదులు సద్వినియోగ పరచుకునేలా న్యాయమూర్తులు కృషి చేయాలని సూచించారు. సివిల్ కేసులతో పాటు రాజీ చేయదగ్గ అన్ని కేసుల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. వీలున్నంత ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని సూచించారు. పోలీసు, ఎక్సైజ్, బీమా సంస్థలతో, న్యాయవాదులతో మాట్లాడి రాజీ చేయదగ్గ కేసులను పరిష్కరించాలన్నారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుకకు డబ్బుల వసూలు

- ఉపాధి హామీ పనులను సర్పంచ్‌లకు ఎందుకివ్వరు?
- ప్రశ్నించిన పలువురు వైసిపి జెడ్‌పిటిసిలు
- వైద్యారోగ్యశాఖ చర్చలో వైసిపి, టిడిపి సభ్యుల వాగ్వాదం
- వ్యవసాయమంత్రి అచ్చెన్నతో సహా ఎమ్మెల్యేలంతా గైర్హాజరు
- మొక్కుబడిగా ముగిసిన జెడ్‌పి సర్వసభ్య సమావేశం

మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఉచిత ఇసుక పేరుతో నిర్ణయించిన ధర కంటే అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారంటూ జెడ్‌పి వైస్ చైర్మన్ సిరిపురం జగన్మోహనరావు, పలువురు వైసిపి సభ్యులు ఆరోపించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన శనివారం సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. యూనిట్ ఇసుక తవ్వడానికి రూ.7 నుంచి రూ.8 వేలు వరకు వసూలు చేస్తున్నారంటూ చెప్పారు. ఇసుక రీచ్‌ల వద్ద సిసి కెమరాలను ఎందుకు తీసేశారని ప్రశ్నించారు. ఇసుక తవ్వకాలను వేళాపాళా లేకుండా తవ్వేస్తున్నారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. పొలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య గోపాలపెంట ఇసుక రీచ్ నుంచి ఇష్టానుసారంగా ఇసుకను తరలిస్తున్నారని వాహనాలను ఆపితే బాస్ చెప్పారంటూ బదులిస్తున్నారని, ఎవరా బాస్ అని ప్రశ్నించారు. ఇసుక అంశంతో పాటు ఉపాధి హామీ మెటీరియల్ కాంపొనెంట్ పనులు, ధాన్యం సేకరణ, వైద్య ఆరోగ్యశాఖ పనితీరుపై సమావేశంలో చర్చించారు.

గ్రామాల్లో సర్పంచ్‌లు ఉండగా ఉపాధి హామీ మెటీరియల్ కాంపొనెంట్ పనులను వెండర్స్‌తో చేయించడమేమిటని పలువురు వైసిపి జెడ్‌పిటిసిలు ప్రశ్నించారు. జెడ్‌పి వైస్ చైర్మన్ జగన్మోహనరావు, రణస్థలం జడ్‌పిటిసి సీతారాముడు, డిసిఎంఎస్ చైర్మన్ గొండు రఘురాం మాట్లాడుతూ మెటీరియల్ తీసుకురావడమే వెండర్స్ పని అని, వాళ్లతో సిసి రోడ్లను ఎలా చేయిస్తారని అన్నారు. అభివృద్ధి అంతా సహకరించాలని ఎమ్మెల్యేలు అడిగితే తాము ఎక్కడా అడ్డు చెప్పలేదని, గ్రామ, మండల, జడ్‌పి స్థాయిల్లో తీర్మానాలు చేసి ఇచ్చామన్నారు. పనుల్లో మాత్రం స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు భాగస్వామ్యం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పశువులు లేనివారికి సైతం గోకులాలు మంజూరు చేశారని పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు.

కిడ్నీ మరణాలు పెరుగుతున్నాయి

ఉద్దానం ప్రాంతంలో గత మూడు నెలల కాలంలో కిడ్నీ మరణాలు పెరుగుతున్నాయని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. సోంపేట, కవిటిలో డయాలిసిస్ సెంటర్లు ఉన్నా 40 వరకు వెయిటింగ్ లిస్టులు ఉంటున్నాయని చెప్పారు. డయాలిసిస్ సెంటర్లను పెంచాలని సూచించారు. జిల్లాలో అదనంగా డయాలిసిస్ సెంటర్లను పెంచేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. హిరమండలంలోని ఏడు గిరిజన పంచాయతీల్లో కిడ్నీ వ్యాధులు ఎక్కువగా ఉన్నాయని, వారికి రక్షిత తాగునీటి అందించేందుకు చర్యలు చేపట్టాలని హిరమండలం జెడ్‌పిటిసి బుచ్చిబాబు గ్రామీణ నీటి సరఫరా అధికారులను కోరారు.

వైసిపి, టిడిపి సభ్యుల వాగ్వాదం

వైద్య ఆరోగ్యశాఖపై చర్చ సందర్భంగా పొలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఐదేళ్లుగా నరసన్నపేట సిహెచ్‌సిని పట్టించుకోలేదంటూ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అసెంబ్లీలో చెప్తున్నారని, వాస్తవాలు చెప్పాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను డిమాండ్ చేశారు. ప్రస్తుతం డిఎంహెచ్‌ఒగా ఉన్న డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి అప్పుడూ పనిచేశారని, ఏమేమి చేశామో సమావేశంలో చెప్పాలని కోరారు. ఇదే సమయంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలోనే పిహెచ్‌సిలు, సిహెచ్‌సిలు అభివృద్ధి చెందాయన్నారు. దీనిపై పలువురు సభ్యులు హర్షధ్వనాలు చేశారు. పాఠశాల్లో మౌలిక వసతులు లేవని, పిల్లలకు పెడుతున్న భోజనంలో పురుగులు ఉన్నాయంటూ చెప్పారు. ఇదే సమయంలో రణస్థలం జడ్‌పిటిసి సీతారాముడు, హిరమండలం జడ్‌పిటిసి బుచ్చిబాబుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. మీరేమి చేశారంటే, మీరేమి అమలు చేశారంటూ పరస్పరం వాదులాడుకున్నారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు జోక్యం చేసుకుని ప్రజా సమస్యలపై చర్చించడానికి ప్రాధాన్యం ఇవ్వాలని, రాజకీయాలు మాట్లాడటానికి ఇది వేదిక కాదని హితవు పలికారు. చైర్మన్ హోదాలో ఉన్నవారు హుందాగా వ్యవహరించాలన్నారు. ఇసుక తవ్వకాలపై గతంలో ఏం జరిగిందో, ఇప్పుడు ఏం జరుగుతుందో విచారణ చేపట్టాల్సిన అవసరముందని అన్నారు.

విచారణ లేకుండా పింఛన్ల తొలగింపు సరికాదు

ఎమ్మెల్యే లేఖ ఇచ్చారని విచారణ లేకుండా పింఛన్లు తొలగించడం సరికాదని చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. ఇళ్లకు వెళ్లకుండానే డోర్ లాక్డ్ అని రాసేస్తున్నారని, విచారణ చేసి అనర్హులైతే తొలగించడానికి తాము అభ్యంతరం చెప్పబోమని ఆమె అన్నారు. రైతుల పొలాల్లో దొంగిలించిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను విద్యుత్‌శాఖ అధికారులు పట్టుకున్నారని, వాటిని వెంటనే రైతులకు అప్పగించాలని జెడ్‌పిటిసి సీతారాముడు కోరారు. అపార్ కోసం విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారని, వారికి ఇబ్బందులు లేకుండా ధ్రువపత్రాలను జారీ చేసేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. ధాన్యం కొనుగోళ్లపై రైతులకు కనీసం సమాచారం కూడా ఇవ్వడం లేదని పలువురు జెడ్‌పిటిసిలు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు.

ఎంపీ, ఎమ్మెల్సీ మినహా అందరూ గైర్హాజరు

సమావేశానికి ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మినహా మిగిలిన ఎమ్మెల్యేలు హాజరు కాలేదు. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అమరావతిలో, కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఢిల్లీలో ఉండటంతో వారూ రాలేకపోయారు. కేబినెట్‌లో ప్రతినిధ్యం వహిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు సమావేశం రాకపోవడంతో సభ్యులు లేవనెత్తిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడమో, అక్కడికక్కడే ఫోన్‌లో మాట్లాడి పరిష్కారం చూపడమో చేసే పరిస్థితి లేకుండాపోయింది. మరోవైపు ధాన్యం కొనుగోలు, సాగునీటి ప్రాజెక్టులు, రోడ్లు, భవనాలశాఖ వంటి కీలక అంశాలపై కనీస చర్చ జరగలేదు. సభ్యులు చర్చించిన సబ్జెక్టుల్లోనూ అంత లోతైన చర్చ సాగలేదు. సమావేశం ఉదయం పది గంటలకు మొదలు కావాల్సి ఉండగా, 11.20 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 2 గంటలకు ముగిసింది.

కలెక్టర్ తీరు మారలే..

గత జెడ్‌పి సమావేశాల మాదిరిగానే కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఈ సారీ ప్రేక్షక పాత్ర పోషించారు. గత సమావేశాల్లో సభ్యులు లేవనెత్తిన అంశాలను రాసుకోగా, ఇప్పుడు కనీసం అది కూడా చేయలేదు. విద్యార్థుల అపార్ కష్టాలు, ఉచిత ఇసుకకు డబ్బులు వసూలు, పింఛన్ల తొలగింపు వంటి ప్రజలకు సంబంధించి ప్రధాన సమస్యలు వచ్చినప్పుడు కూడా ఆయనలో స్పందన కనిపించలేదు. వైసిపి, టిడిపి సభ్యులు వాదులాడుకుంటున్న సందర్భంలోనూ జోక్యం చేసుకుని నివారించే ప్రయత్నం చేయలేదు. జెడిపి సర్వసభ్య సమావేశం కేవలం అధికారులకు, ప్రజాప్రతినిధులకు తప్ప తనకు సంబంధం లేనట్లుగా వ్యవహరించారు.

సమావేశంలో జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్, పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్, జెడ్‌పి సిఇఒ ఎల్.ఎన్.వి.శ్రీధర్‌రాజా, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

పాఠశాలల విలీన ప్రక్రియను రద్దు చేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు ఈ నెల 24, 25 తేదీల్లో మందస మండలం హరిపురంలో నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లండ బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చౌదరి రవీంద్రలు తెలిపారు. నగరంలోని యుటిఎప్ జిల్లా కార్యాలయంలో మహాసభల నిర్వహణ, ఏర్పాట్లపై శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన పాఠశాలల విలీన జిఒను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే అటువంటి చర్యలను విడనాడాలన్నారు. ఉపాధ్యాయులకు గడచిన కాలంలో చెల్లించాల్సిన బకాయిలు తక్షణమే చెల్లించాలన్నారు. ప్రభుత్వం 11వ పిఆర్‌సిలో లోపాలను సరిదిద్దడంతో పాటు 12వ పిఆర్‌సి అమలుకు చర్యలు చేపట్టాలన్నారు. హరిపురం నిర్వహిస్తున్న మహాసభల్లో విద్యారంగ ఉపాధ్యాయ సమస్యలను చర్చిస్తామని తెలిపారు. తొలిరోజు భారీ ఎత్తున ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం ప్రతినిధుల సభ ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కేసులకు బెదరం

ఎమ్మెల్సీ శ్రీనివాస్

శ్రీనివాస్, ఎమ్మెల్సీ

శ్రీకాకుళం అర్బన్ : వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డిపై, ఆనాటి మంత్రులపై, శాసనసభ్యులపై ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నోటికొచ్చినట్లు తిడితే పట్టించుకోని చట్టం, ఇప్పుడు తమపై ఎందుకు కేసులు పెడుతున్నారని, ఇదేనా విద్యాశాఖ మంత్రి లోకేష్ చెప్పిన రెడ్‌బుక్ రాజ్యాంగమని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ విమర్శించారు. నగరంలోని హోటల్ గ్రాండ్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. తమపై కేసులు పెడుతున్న పోలీసులు నాటి పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలపైనా కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను తిట్టానని తనపై కేసు పెట్టిన పోలీసులు అదే స్ఫూర్తి, అదే చట్టం ఆయనపైనా వర్తిస్తుందని మరచిపోతున్నారన్నారు. రెండేళ్ల తర్వాత కేసు పెట్టారంటే ఇది కక్షసాధింపులో భాగమేనని పేర్కొన్నారు. ఎన్ని కేసులు పెట్టినా బెదిరేది లేదని స్పష్టం చేశారు. వైసిపి కార్యకర్తలపై, నాయకులపై కేసులు పెట్టి పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిప్పడమే కూటమి ప్రభుత్వం ఐదు నెలల పాలన అని వ్యాఖ్యానించారు. జైలు జీవితం తనకు కొత్త కాదని, పార్టీ కోసం, అధినేత జగన్ కోసం దేనికైనా సిద్ధమని స్పష్టం చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో కూటమి ప్రభుత్వం విచిత్రమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని వ్యాఖ్యానించారు. 20 లక్షల ఉద్యోగాలు, లేదంటే నిరుద్యోగ భతి ఇస్తామని చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. తల్లికి వందనం బడ్జెట్‌లో నిధులు కటాయించలేదని పేర్కొన్నారు.

నేడు, రేపు యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు

హరిపురంలో ఏర్పాట్లు పూర్తి

శ్రీకాకుళం ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా మహాసభలు ఆదివారం నుంచి మందస మండలం హరిపురంలో సభలను రెండు రోజులు పాటు నిర్వహించనున్నారు. మహసభల్లో భాగంగా మొదటి రోజు హరిపురం జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద ఉదయం తొమ్మిది గంటలకు పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అక్కడ నుంచి ర్యాలీగా బయలు దేరి రట్టి రోడ్డు మీదుగా ఎస్‌బిఐ కూడలికి చేరుకోనున్నారు. అనంతరం అక్కడ బహిరంగ సభ నిర్వహించనున్నారు. సభ అనంతరం ప్రతినిధుల సభ నిర్వహించున్నారు. మరుసటి రోజు గత సభల తర్వాత చేపట్టిన ఉద్యమాలు, విద్యా, ఉపాధ్యా రంగ సమస్యల పరిష్కారానికి చేసిన కృషిని చర్చించనున్నారు. రాబోవు రోజుల్లో చేపట్టనున్న భవిష్యత్ కార్యచరణను రూపొందించనున్నారు. అనంతరం కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నారు. సభలకు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బాబూరావు, శ్రీరామమూర్తి పిలుపునిచ్చారు.

కొవ్వొత్తులు చేతబట్టి మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థినులు

నిందితులను కఠినంగా శిక్షించాలి

శ్రీకాకుళం: విశాఖ లా విద్యార్థికి న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.హరీష్, ఐద్వా జిల్లా కన్వీనర్ ఎ.లక్ష్మి, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు సిహెచ్.రాజు డిమాండ్ చేశారు. నగరంలో ప్రభుత్వ మహిళా కళాశాల నుంచి సూర్యమహల్ కూడలి వరకు విద్యార్థినులు శనివారం కొవ్వొత్తులు చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. అనంతరం సూర్యమహల్ కూడలి వద్ద ఘటనను నిరసిస్తూ... మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల అభివృద్ధికి చేసిన వాగ్దానాలు వాస్తవాల్లోకి రావడం లేదన్నారు. దాని నిదర్శనమే మహిళలపై జరుగు అత్యాచారాలని ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశం అయినా మహిళల హక్కులకు ఏ మాత్రం ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. ఇటీవల కాలంలోనే జిల్లాలో జరుగు అత్యాచారాలు కేవలం పత్రికాప్రకటన వరకే ప్రజాప్రతినిధులు స్పందిస్తున్నారని విమర్శించారు. కానీ, బాధితులకు న్యాయం చేయడంలో చిత్తశుద్ధి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు ఎం.లలిత, లత, శ్రీదేవి, లక్ష్మి, ఎస్ఎఫ్ఐ నాయకులు సంతోష్, దివ్య, నగేష్ పాల్గొన్నారు.

వాడివేడిగా మండల సమావేశం

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎన్నడూ లేనివిధంగా వాడివేడిగా సాగింది. ముందుగా రూ.99 లక్షలు అవకతవకలు తీర్మానంపై సభ్యులు నిలదీశారు. పనులు మంజూరుపై చర్చించకుండా ఎలా తీర్మానం చేశారని సభ్యులు పట్టుపట్టారు. ఎటువంటి తీర్మానం లేకుండా ముగించిన మండల సమావేశానికి 23 మందికి గాను, 22 మంది ఎంపిటిసి సభ్యులు హాజరయ్యారు. ఎంపిపి మొదలవలస చిరంజీవి అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సమావేశంలో రూ.15వ ఆర్థిక సంఘం నిధులు రూ.99 లక్షల పనులకు సంబంధించి తీర్మానాలు, అమలులో అవకతవకలు చోటు చేసుకున్నాయని సభలు సభ దృష్టికి తీసుకొచ్చారు. 14 మంది సభ్యులు దీనిపై దీనిపై చర్చించాలని పట్టుబట్టి బైఠాయించారు. దీంతో సమావేశం రసాబాసగా సాగింది. దీంతో ఎంపిపి సభను 12 గంటలకు వాయిదా చేశారు. 12 గంటలకు సమావేశం మొదలు కాగా, విపక్ష సభ్యుడిగా నాయకత్వం వహించిన మాజీ ఎంపిపి బళ్లాడ జనార్థన్‌రెడ్డి, జరుగుల్ల విజయ, సీరపు శ్రీరామ్మూర్తి, మాడుగుల జగదీష్ గత మూడేళ్లు తమకు మండల పరిషత్ నిధుల్లో పైసా కూడా పనులు మంజూరు చేయలేదని, తమను నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు ఏమి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. గత సమావేశంలో రూ.99 లక్షలు పనులు సమావేశంలో పెట్టి ఎవరికీ తెలియకుండా రూ.ఐదు లక్షల లోపల పనులు ఏ విధంగా విభజించి తీర్మానాలు చేస్తారని నిలదీశారు. ఈ అంశంపై చర్చించాలని ఎంపిటిసిలు పట్టుపట్టారు. ఈ సమయంలో సమావేశానికి అడ్డుతగులుతున్నారని నలుగురు సభ్యులను నాలుగు నెలల పాటు సస్పెండ్ చేయాలని ఎంపిడిఒకు ఎంపిపి సూచించారు. సస్పెండైన నలుగురు సభ్యులు బయటకు వెళ్లాలని ఎంపిడిఒ హరిహరరావు సూచించినా వెళ్లకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి సమావేశం హాల్‌లో సభ్యులను బయటకు తీసుకొచ్చే అధికారం లేదని స్పష్టం చేశారు. దీంతో అధ్యక్షులు మళ్లీ సభను 4 గంటలకు వాయిదా వేశారు. మూడోసారి సమావేశం ప్రారంభమైనా మళ్లీ సభ్యులు చర్చపై డిమాండ్ చేశారు. దీనిని పట్టించుకోకుండా ఎంపిపి అజెండాను చదివి సమావేశం ఎటువంటి తీర్మానం చేయకుండా ముసిందని చెప్పేసి వెళ్లిపోయారు.

ఎంపిపిని నిలదీస్తున్న సభ్యులు

సోలార్ పవర్ స్కాంపై విచారణ చేపట్టాలి

జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శి నాగిరెడ్డి

ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అమెరికా విచారణ సంస్థ గుర్తించిన సోలార్ పవర్ స్కాంకు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని, ప్రధాని మోడీ మిత్రుడైన అదానిని అరెస్టు చేసి పూర్తి విచారణ చేపట్టాలని ఆలిండియా యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి మమతా నాగిరెడ్డి, యుజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావులు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం జిల్లా పర్యటనకు వచ్చిన వారు నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. అంతకుముందు అరసవల్లి రోడ్డులోని ఇందిరా విజ్ఞాన్ భవన్ వద్ద ఆదానిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని మోడీ సోలార్ ప్లవర్ స్కామ్‌పై ఎందుకు నోరు మెదడంలేదని ప్రశ్నించారు. సుమారు రూ.రెండు వేల కోట్లు లంచాలు ఇచ్చినట్టు అమెరికా దర్యాప్తు సంస్థ వెల్లడించిందన్నారు. అదానికి ధారాదత్తం చేసిన పోర్టులు, ఎయిర్ పోర్టులు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల విక్రయాలపైనా సిబిఐతో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ భవితవ్యంపై స్పష్టమైన ప్రకటన చేయకుండా ఈ నెల 29న ప్రధాని నరేంద్రమోడీ విశాఖ పర్యటన చేయొద్దన్నారు. దీనిపై కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఉత్తరాంధ్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు అంబటి కృష్ణారావు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శివకుమార్, జిల్లా ఇన్‌ఛార్జి గాదం వెంకట త్రినాథరావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు రెల్ల సురేష్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కె.వి.ఎల్.ఎస్.ఈశ్వరి, రాష్ట్ర ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి తెంబూరు మధుసూదనరావు, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పూడి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- లావేరు

జాతీయ రహదారిపై తరుచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి ఆదేశించారు. శనివారం లావేరు, ఎచ్చెర్ల, నగరంలోని మహిళా పోలీస్‌స్టేషన్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను తనిఖీ చేసి పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు, ముఖ్యంగా గంజాయి వాడకం, అక్రమ తరలింపుపై విస్తృతంగా వివరించాలని తెలిపారు. రౌడీషీటర్లపై ప్రత్యేకంగా నిఘా పెట్టాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు భద్రత నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఎస్ఐకి ఆదేశించారు. ఈయనతో పాటు జెఆర్ పురం సిఐ అవతారం, ఎస్ఐ లక్ష్మణరావు, సిబ్బంది ఉన్నారు.

లావేరు : రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

బాబు ప్రయివేట్ రహ'దారి'

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

'నా దారి రహదారి, అడ్డు రాకుండంటూ' నరసింహ సినిమాలో రజనీకాంత్ చెప్పిన డైలాగ్‌ను తలపించేలా బాబు వాక్కులు ఉన్నాయి. మాది అంతా ప్రయివేట్ పాలసీ... ఎవరూ అడ్డు చెప్పకూడదన్న రీతిలో ఆయన ధోరణి కనిపిస్తోంది. ఇటీవల శాసనసభలో ఎమ్మెల్యేలతో రోడ్లను అవుట్ సోర్సింగ్ ఏజెన్సీకి అప్పగిస్తామని, వారే టోల్ ఫీజు వసూలు చేసుకుంటారంటూ తన మనసులో మాట చెప్పేశారు. జనవరిలో పండగ సందర్భంగా ఎవరైనా రాష్ట్రానికి వస్తే మెరుగైన రోడ్లు కనిపంచాలన్న ఉద్దేశంతో ఈ విధంగా చేస్తున్నామంటూ ప్రజలకేదో మేలు చేస్తున్నట్లుగా చెప్పుకొచ్చారు. ఎక్కడైనా వ్యతిరేకిస్తే అక్కడ గుంతల రోడ్లతోనే ఉండాల్సి వస్తుందంటూ జనాన్ని సైతం హెచ్చరించారు. ప్రజలను ఒప్పించే బాధ్యతనూ ఎమ్మెల్యేలకు అప్పగించారు. టిడిపి కూటమి ప్రభుత్వం రోడ్లను బాగు చేస్తుందని, గుంతల్లో ప్రయాణించే బాధలు తప్పుతాయని జనం అనుకుంటుంటున్న తరుణంలో వారిపైనే భారం మోపేలా చంద్రబాబు తీసుకున్న నిర్ణయాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. జిల్లాలో ఉన్న ప్రధాన రహదారులైన కళింగపట్నం- శ్రీకాకుళం- పార్వతీపురం (సిఎస్‌పి), బత్తిలి-అలికాం, చిలకపాలెం-రాజాం-సాలూరు రహదారులను జాతీయ రహదారులుగా మారుస్తారన్న చర్చ సాగుతోంది. ఈ రోడ్లలోనే 'టోల్' తీసే పనికి ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లుగా తెలుస్తోంది. రాష్ట్ర రోడ్లపై ఏర్పాటు చేస్తున్న టోల్ గేట్లలో ఆటోలు, ద్విచక్ర వాహనాలకు మినహాయింపు ఇస్తామంటూ బాబు వాటిపై తన పెద్ద మనసు చాటుకున్నారు. జాతీయ రహదారుల్లోని టోల్ గేట్లు సైతం వాటి నుంచి డబ్బులు వసూలు చేయడం లేదనే విషయం అందరికీ తెలిసినా అదేదో కొత్త అంశంగా బాబు చెప్పుకొచ్చారు. ఆ రెండింటికీ మినహాయింపు ఇచ్చినా టోల్ గేట్ల ఏర్పాటుతో వేర్వేరు రూపాల్లో ప్రజలపై పరోక్షంగా భారం పడనుంది. బస్సుల నుంచి వసూలు చేసే టోల్ టాక్స్ ఛార్జీల రూపంలో ప్రజల నెత్తిన పడనుంది. అదేవిధంగా సరుకు రవాణ వాహనాలపై విధించే టోల్ రుసుం నిత్యవసర ఇతర సరుకుల రేట్లు పెరగడానికి దారి తీస్తుంది. అర్థశాస్త్రం అభ్యసించిన చంద్రబాబుకు ఇవన్నీ తెలియని విషయాలు కావు. ప్రజలకు ఏదీ ఉచితంగా ఇవ్వకూడదన్న ప్రపంచ బ్యాంకు విధానాలను ఔపాసన పట్టిన బాబుకు ప్రయివేట్ విధానాలు అమలు చేయడం కొత్తేమీ కాదు. గతంలో ఇటువంటి ఎన్నో అమలు చేసిన చేసిన ఘనతను బాబు దక్కించుకున్నారు. రోడ్లపై టాక్స్‌లు కూడా ఆ సంస్కరణల్లో నుంచి పుట్టుకొచ్చినవే.

'ఏరు దాటే వరకు ఓడ మల్లన్న... ఏరు దాటిన తర్వాత బోడి మల్లన్న' అన్న చందంగా ఉంది టిడిపి ప్రభుత్వం. ఎన్నికల ముందు అనేక వాగ్దానాలను ఇచ్చిన కూటమి ప్రభుత్వం వాటి అమలుపై ఇప్పుడు కొత్త బాష్యం చెప్తున్నారు. వాలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని, తాము అధికారంలోకి వస్తే రూ.10 వేలు వేతనం చెల్లిస్తామని ఎన్నికల ముందు చెప్పిన బాబు ప్రస్తుతం ప్లేటు ఫిరాయించారు. శాసన మండలిలో గ్రామ, వార్డు సచివాలయాలశాఖ మంత్రి డోలా బాల వీరాంజయనేయస్వామి చెప్పిన సమాధానాలు చూసిన వాలంటీర్లు షాక్‌కు గురయ్యారు. లేని వాలంటీర్లకు వేతనాలు ఎలా ఇస్తాం, ఎలా పెంచుతాం అంటూ మంత్రి చెప్పడంపై వాలంటీర్లు మండిపడుతున్నారు. వ్యవస్థ ఉనికిలో లేకపోవడంతో ఏమీ చేయలేకపోతున్నాం, వాళ్లు విధుల్లో ఉండి ఉంటే కొనసాగించే వాళ్లమని అని మంత్రి చెప్పడం ద్వారా హామీని ఎగ్గొట్టేందుకు కూటమి ప్రభుత్వాకి ఇది సాకుగా కనిపించింది. వాలంటీర్లకు హామీ ఇచ్చిన సమయంలోనే వారు విధులకు దూరంగా ఉన్నారన్న విషయం బాబు ప్రభుత్వం మరిచినట్లుంది.

ఇటీవల బాబు వక్కాణించినట్లు ప్రస్తుతం అంతా రాజకీయ పాలనే సాగుతోంది. కూటమి, ముఖ్యంగా టిడిపి కార్యకర్తలకు ఏది చేస్తే లబ్ధి కలుగుతుందో వాటిపైనే చాలా వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్న పరిస్థితిని మనం చూస్తున్నాం. 2014-19 కాలంలో నీరు-చెట్టు పనులు చేసిన టిడిపి నాయకులు, కార్యకర్తలకు వైసిపి ప్రభుత్వం బిల్లులు ఆపేసింది. కార్యకర్తల ఆర్థిక ఇబ్బందులను తీర్చేందుకు బిల్లుల చెల్లింపునకు మొదటి విడతగా రాష్ట్ర వ్యాప్తంగా రూ.330 కోట్లను విడుదల చేసింది. జిల్లాకు సంబంధించి రూ.4 కోట్లకు వరకు చెల్లింపులు చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఇప్పుడు కొత్త ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణం వంటి పనులను చేపట్టనుండటంతో ఆ పనులు చేసే తమ అనుయాయులకు మేలు ఒనగూరేలా మొబలైజేషన్ అడ్వాన్స్‌లు చెల్లించేందుకు ఇటీవల కేబినెట్ నిర్ణయం తీసుకుంది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో అధిక శాతం వైసిపి చేతిలో ఉండటం, వారిని టిడిపిలోకి తీసుకువచ్చి వాటిని కూటమి పరం చేసేందుకు మున్సిపల్ చట్టం అడ్డుస్తోంది. దీంతో చైర్మన్లపై నాలుగేళ్ల తర్వాత అవిశ్వాసం పెట్టాలనే గత ప్రభుత్వ నిర్ణయాన్ని తిరగదోడి ఏకంగా చట్టానికి సవరణ చేసి దానిని రెండేళ్లకు కుదించింది.

పరిశ్రమలు, పెట్టుబడులు అని నిత్యం జపం చేసే బాబు భూములను కట్టబెట్టేందుకు ల్యాండ్ పూలింగ్ విధానాన్ని తీసుకురానున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఎయిర్‌పోర్టు పేరుతో జిల్లాలో భూములు సేకరించేందుకు ప్రభుత్వం యంత్రాంగం ఇప్పటికే రంగంలోకి దిగింది. మందస, వజ్రపుకొత్తూరు మండలాలకు చెందిన వివిధ గ్రామాల్లో సుమారు 1400 ఎకరాలు వరకు గుర్తించారు. దీనిపై ఇప్పటికే మందస ప్రాంతంలో రైతులు తమ భూములు ఇవ్వమంటూ ఆందోళనకు దిగుతున్న పరిస్థితిని మనం చూస్తున్నాం. భూ సేకరణకు, తమ మనుషులు పెట్టే పరిశ్రమలకు ఇబ్బంది పెట్టకుండా ఉంటేందుకు ముందస్తు నిర్బంధ చట్టానికి (పీడీ చట్టం) సైతం ప్రభుత్వం ఇటీవల సవరణలు చేసింది. రాబోవు రోజుల్లో ప్రజలు ఎదుర్కోబోవు నిర్బంధానికి ఇవి సంకేతాలుగా కనిపిస్తున్నాయి. టిడిపి కూటమి నిర్ణయాలు, వేస్తున్న అడుగులను గమనించి ప్రజా వ్యతిరేకంగా ఉన్న వాటిని ఐక్యంగా తిప్పిగొట్టాల్సిన అవసరం ఉంది.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) SRIKAKULAM
IA.33/2023 in OS.19/2013

Between:- **V.M.M. Sainadh Reddy @ Mohan Reddy** .....Petitioner/Plaintiff
And : **Korada Sri Krishna Murthy and 4 others** .....Respondents/ Defendants

To,
R-2: Korada Venkata Sri Vasudeva Rao, S/o late Venkata Narayana , Srikurmam Panchayat and post ,Gara Mandalam ,Srikakulam District.
R-3: Korada Suseela, W/o late Venkata Govindarajulu Srikurmam Panchayat and post ,Gara Mandalam ,Srikakulam District .

నోటీస్

పై నెంబర్ IA.33/2023 in OS.19/2013 లో Setting Aside Dismissal Petitionలో మీకు నోటీసు నిమిత్తము, మీరు 2 మరియు 3 ప్రతివాదులు అయి ఉన్నారు. మీరు నోటీసు నిమిత్తము మీ హాజరు కొరకై **తేదీ 25-11-20 24 న వాయిదా అయి ఉన్నది.** సదరు పై తేదీన ఉదయం 10.30 నిమిషాలకు స్వయంగా గాని, వకీల్ ద్వారా గాని హాజరై మీ వాదన తెలియపరచవలెను, లేనియెడల మీ పరోక్షమున శ్రీ కోర్టు వారు విచారించి తీర్మానించడం అగును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

మంగళంపల్లి కృష్ణాజి
పిటిషనర్ తరుపున న్యాయవాది,
శ్రీకాకుళం.

ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డిసి శ్రీకాంత్ రెడ్డి

ఎంఆర్‌పికే మద్యం విక్రయాలు

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి

ప్రజాశక్తి- పొందూరు

మద్యం దుకాణాల్లో ఎంఆర్‌పి ధరలకే మద్యం విక్రయాలు జరపాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి హెచ్చరించారు. స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పోలీస్ స్టేషన్‌ను ఆయన శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ మద్యం విక్రయదారులు ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి మద్యం దుకాణాలను నిర్వహించాలన్నారు. గ్రామాల్లో మత్తు పదార్థాల వినియోగంపై జిల్లాలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం స్టేషన్‌లో దస్త్రాలను పరిశీలించారు. ఆయనతో పాటు సిఐ వై.రాజు, ఎస్ఐ కరుణ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

అవార్డు అందుకుంటున్న నరసింహమూర్తి, గంగాధర్

ఐఎంఎకు రెండు అవార్డులు

శ్రీకాకుళం: గుంటూరులో మూడు రోజుల పాటు నిర్వహించిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ బ్రాంచ్ 66వ వార్షిక సమావేశం నిర్వహించారు. సమావేశం జిల్లా ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌కు రెండు అవార్డులు వచ్చాయి. ఉత్తమ ప్రెసిడెంట్ అవార్డుగా డాక్టర్ సనపల నరసింహమూర్తికి, మిషన్ పింక్ ఆక్టివిటీ అవార్డు జిల్లా ఉమెన్స్ డాక్టర్స్ వింగ్‌కు దక్కాయి. ఈ అవార్డులను ఐఎంఎ జిల్లా అధ్యక్షులు డాక్టర్ నరసింహమూర్తి, ఐఎంఎ జిల్లా కార్యదర్శి డాక్టర్ గొండు గంగాధర్ అందుకున్నారు. రెండు అవార్డులు పొందడంపై జిల్లా వైద్యులు అరసవల్లి, సత్యానంద్, వినోద్‌కుమార్, సోమేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు.

ఎస్ఐని సన్మానిస్తున్న సర్పంచ్ లక్ష్మణరావు

ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి

కవిటి: కవిటి మేజర్ పంచాయతీలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టిసారించామని ఎస్ఐ రవివర్మ అన్నారు. స్థానిక బజారు వీధి, బస్టాండ్ కూడలి వద్ద ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేయాలని సర్పంచ్ సంఘ మండల అధ్యక్షుడు పూడి లక్ష్మీనారాయణ ఎస్ఐని కోరారు. ఈ మేరకు ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన రవివర్మను శనివారం మర్యాదపూర్వకంగా కలిసిన సర్పంచ్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు వివరిస్తూ కవిటిలో ట్రాఫిక్ నియంత్రణ, మితిమీరిన వేగంతో ప్రయాణం, మైనర్ వాహన చోదకులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఆయనతో పాటు పంచాయతీ సిబ్బంది నూకరాజు ఉన్నారు.

ఓటర్ల జాబితా ప్రచురిస్తున్న డిటి శ్రీహరి

ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా ప్రచురణ

ఇచ్ఛాపురం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాను డిటి శ్రీహరి బుధవారం ప్రచురించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా ప్రచురణ చేశామన్నారు. సమ్మయంలో డిసెంబరు 12లోగా అభ్యంతరాలు తెలియ జేయాలన్నారు. మండలంలో మొత్తం 96 ఓట్లు ఉన్నాయని అన్నారు. ఇందులో పురుషులు 61, మహిళా లు 35, కంచిలి మండలంలో మొత్తం 68. ఇందులో పురుషులు 48, మహిళలు 20, కవిటి మండలంలో మొత్తం 82, ఇందులో పురుషులు 58, మహిళలు 24, సోంపేట మండలంలో మొత్తం 164. ఇందులో పురుషులు 128, మహిళలు 36 ఉన్నారు. మొత్తం 410 ఓట్లు ఉన్నాయని తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లపై శిక్షణ

జి.సిగడాం : సమావేశంలో మాట్లాడుతున్న ప్రియాంక

ప్రజాశక్తి- బూర్జ

సచివాలయ పరిధిలోనున్న రైతు సేవా కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని కొత్తూరు వ్యవసాయ సహాయ సంచాలకులు బి. రాజగోపాల్ అన్నారు. శనివారం స్థానిక మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నూతనంగా నియమించిన టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పాటించాల్సిన నాణ్యతా ప్రమాణాలు, కొత్తగా ఎటువంటి మార్పులపై శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లా పౌర సరఫరాల కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన కె.గౌతమి శిక్షణను అందించారు. నాణ్యతా ప్రమాణాలను లోబడి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని, ప్రభుత్వం ఇచ్చిన సూచనలను పాటించి రైతులకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎన్. శ్రీనివాసరావు, తహశీల్దార్ వై.వి.పద్మావతి, పౌర సరఫరాశాఖ ఇన్‌ఛార్జి డిటి హెచ్ మురళీ, మండల గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

జి.సిగడాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పౌర సరఫరాల శాఖ ధాన్యం కొనుగోలు శిక్షణ అధికారి ప్రియాంక మాట్లాడుతూ ధాన్యంలో తేమశాతం పరిశీలించాలన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు రైతుల కల్లాల వద్దకు వెళ్లి నమూనా సేకరించిన తరువాత తేమను పరిశీలించాలన్నారు. తేమ 17 శాతం మించకుండా ఉండాలన్నారు. ఈ ఏడాది రైతులు తమకు కావాలనుకున్న మిల్లుకు ట్రక్‌షీట్ ద్వారా ధాన్యాన్ని పంపించవచ్చునని మండల ఎఒ శారద తెలిపారు. కార్యక్రమంలో డిటి, గ్రామ వ్యవసాయ సహాయకులు, టిఎలు, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

సోంపేట : శిక్షణ ఇస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

బూర్జ : మాట్లాడుతున్న గౌతమి

సోంపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర ప్రమాణాలపై డేటా ఎంట్రీ ఆపరేటర్లకు, వ్యవసాయశాఖ సిబ్బందికి శనివారం శిక్షణ నిర్వహించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద వ్యవసాయశాఖ ఎడిఎ కె.జగన్మోహనరావు అధ్యక్షతన శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు సమయంలో పాటించాల్సిన ప్రమాణాల గురించి తెలియచేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.అప్పలస్వామి, ఎఒ నరసింహమూర్తి, డిటి కూర్మారావు, శిక్షకులు సిమాన్, సంతోష్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ఈ ఏడాది క్వింటా ధాన్యం 2,300గా, గ్రేడ్-ఎ రకం 2,320గా ప్రభుత్వం ధర నిర్ణయించిందని సివిల్ సప్లయి అధికారి సంతోష్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలుపై టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేట్, వ్యవసాయ సహాయకులకు ధాన్యం కొనుగోలు సమయంలో పాటించాల్సిన విధి విధానాలపై శనివారం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల ఎఒ భార్గవి, సివిల్ సప్లయి ట్రైనింగ్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

సీజ్ చేసిన ఇసుక లారీలు

ఏడు ఇసుక లారీలు సీజ్

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని నాగావళి నదీ పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఏడు లారీలను సీజ్ చేసినట్లు స్థానిక ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి నాగావళి నది నుంచి అక్రమ తవ్వకాలు జరిపి లారీల ద్వారా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. వెంటనే రాత్రి రెండు గంటల సమయంలో కొత్త రోడ్డు సమీపంలో ఇసుక లారీలు ఆపి పత్రాలను పరిశీలించగా ఎటువంటి అనుమతి పత్రాలు లేనందున లారీలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించామని తెలిపారు. సీజ్ చేసిన ఇసుక లారీలను జిల్లా గనులశాఖ అధికారులకు అప్పగించామని తదుపరి గనులశాఖ ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

ఓటర్ల తొలగింపుపై దర్యాప్తు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని ఓటర్ల తొలగింపు, నమోదు అంశంపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అప్పారావు దర్యాప్తు చేశారు. శనివారం మండలంలోని కొరగాంలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్ల నమోదు, తొలగింపుల విషయంపై ఆరా తీశారు. ఇటీవల మృతి చెందిన వారి వివరాలను, కొత్తగా నమోదైన ఓటర్ల వివరాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో బిఎల్‌ఒలతో పాటు గుత్తావల్లి వైద్య సిబ్బంది మజ్జి వెంకటనాయుడు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని పరిశీలిస్తున్న శాఖ ఎడి మధుబాబు

ధ్యానం పరిశీలన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని జలకలింగపురం, మర్రిపాడు గ్రామాల్లో రైతులు నూర్చిన ధాన్యాన్ని మండల స్పెషల్ ఆఫీసర్, పలాస వ్యవసాయ సహాయ సంచాలకులు ఎల్.వి.మధుబాబు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతలతో మాట్లాడుతూ నూర్పుడి చేసుకున్న ధాన్యాన్ని శుభ్రపరచుకొని 17 శాతం వచ్చేంతవరకు ఆరబెట్టుకోవాలని సూచించారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి సిబ్బంది వచ్చి ధాన్యాన్ని పరీక్షిస్తారని తెలిపారు. అనంతరం గ్రామ వ్యవసాయ సహాయకులు రైతుకు షెడ్యూల్ ఇస్తారని అన్నారు. కార్యక్రమంలో మండల ఎఒ ఎస్.దానకర్ణుడు, వ్యవసాయ విస్తరణాధికారి ప్రభావతి, మర్రిపాడు-సి, పెద్దపద్మాపురం సర్పంచ్‌లు గణపతిరావు, శ్రీధర్, బాలరాజు, వెంకట్రావు, దినకర్, వ్యవసాయ సహాయకులు పుష్పత్రినాథ్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'సతీష్‌బాబు మోసం చేశాడు'

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని లోహరబంద పంచాయతీ కార్యదర్శి మన్నం సతీష్ బాబు ఉద్యోగాల పేరుతో పలువురుని మోసం చేసిన మాట వాస్తవమేనని శ్రీకాకుళం డిఎస్‌పి సిహెచ్.వివేకానంద తెలిపారు. ఈ సందర్భంగా శనివారం మీడియాతో మాట్లాడారు. ఎస్‌పి ఆదేశాల మేరకు శుక్రవారం బాధితులను, సతీష్ బాబును విచారించినట్టు తెలిపారు. ఈ విచారణలో కొంతమంది వద్ద డబ్బులు తీసుకున్న మాట వాస్తవమేనని సతీష్‌బాబు అంగీకరించినట్టు చెప్పారు. తుది నివేదిక ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

కోర్టు భవనం పరిశీలన

పలాస : పలాసలో కోర్టు భవనం మార్పు చేసేందుకు జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా పలాస జూనియర్ సివిడ్ జడ్జి యు.మాధురితో కలిసి శనివారం పరిశీలించారు. ప్రస్తుతం పలాసలోని కోర్టు భవనాలను శనివారం పరిశీలించి న్యాయవాదులకు, కక్షిదారులకు కాని సౌకర్యకరంగా లేదని గుర్తించారు. దీనిపై గతంలో కూడా తమకు ఇక్కడ పనిచేసిన న్యాయమూర్తులు, న్యాయవాదులు జిల్లా జడ్జికి తెలిపారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయానికి అనుకున్ని ఎస్‌ఎఫ్‌ఎస్ హాస్టల్ భవనాన్ని జిల్లా జడ్జి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వీరితో కాశీబుగ్గ సిఐ మోహనరావు, న్యాయవాదులు ఉన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

పోలాకి: ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిశుభ్రత పాటించాలని ఎంపిడిఒ జి.రవికుమార్ అన్నారు. మండలంలోని ఈదులవలస ఎపి మోడల్ స్కూల్‌లో వరల్డ్ టాయిలెట్స్ డే వారోత్సవాల్లో భాగంగా శనివారం పరిసరాలు పరిశుభ్రతపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు అంటు వ్యాధుల నియంత్రణ, మరుగుదొడ్ల నిర్వాహణ, పరిశరాలు పరిశుభ్రత తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి పద్మావతి, ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

29 మాల మహాగర్జన

పలాస : ఈ నెల 29న మాల మహా గర్జన ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నియోజకవర్గం అధ్యక్షులు తెప్ప పాపారావు పిలుపునిచ్చారు. పలాస ఉద్దాన ప్రాంత ప్రజలను బహిరంగసభకు ఆహ్వానిస్తూ ఇంటింటికి వెళ్లి శనివారం పోస్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగానికి విరుద్ధమని రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆలోచించాలన్నారు. రెండు రాష్ట్రాల మాల, మాదిగలను రాజకీయ లబ్ధికోసం అన్యాయం చేయవద్దని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పున:పరిశీలించాలని కోరారు. ఇటీవల ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మెగా డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయచాలన్నారు. బీర అప్పారావు, వై.దేవరాజు, సంజీవరావు, ఎ.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

'శంఖారావాన్ని' విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- మందస

కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నవంబరు 26న కలెక్టరేట్, పలాస ఆర్‌డిఒ కార్యాలయం వద్ద చేపట్టనున్న ప్రజాశంఖారావాన్ని విజయవంతం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సిఐటియు నాయకులు ఆర్.దిలీప్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి మట్ట ధర్మారావు అధ్యక్షతన అన్ని సంఘాల నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2021లో రైతులు పోరాట ఫలితంగా మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేసి అన్ని పంటలకు మద్దతు ధర గ్యారంటీ చట్టం చేస్తామని రాతపూర్వకంగా ఇచ్చిన హామీ అమలు చేయాలన్నారు. సర్వ సంపదలు సృష్టించేది కార్మికవర్గమని పేర్కొన్నారు. పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు రూ.19.28 లక్షల కోట్లు రుణమాఫీ, పన్ను రాయితీ, ప్రోత్సాహాల పేరుతో ప్రజల ధనాన్ని దోచిపెట్టిందన్నారు. విశాఖస్టీల్ ప్లాంట్‌తో సహా భారీ పరిశ్రమలు, గనులు, సముద్రతీరాన్ని కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతుందన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించాలన్నారు. నాలుగు లేబర్ కోడ్లను చట్టాన్ని రద్దు చేయాలన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. పి.అప్పలస్వామి, జగ్గారావు, చిన్నారావు, శాంతారావు పాల్గొన్నారు.

మందస : మాట్లాడుతున్న మోహనరావు

వజ్రపుకొత్తూరు : కార్మికుల పొట్టకొట్టి కార్పొరేట్ కంపెనీలను పెంచే నాలుగు లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలని రైతు కార్మిక సంఘాలు నాయకులు బి.రామకృష్ణ, ఎన్. మోహనరావు డిమాండ్ చేశారు. ఈ నెల 26న ఆర్‌డిఒ కార్యాలయం వద్ద కార్మికులు చేపట్టనున్న విజయవంతంపై ప్రచారం నిర్వహించారు.

పలాస : ఈ నెల 26న నిర్వహించున్న శ్రామిక శంఖారావాన్ని విజయవంతం చేయాలని సిఐటియు, ఎపి రైతు సంఘం, రైతు కూలీ సంఘం నాయకులు ఎన్.గణపతి, సిహెచ్.వేణుగోపాల్, యు.తాతారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు పలాస-కాశీబుగ్గ పట్టణంలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎస్.కుమార్, వి.కృష్ణారావు పాల్గొన్నారు.

సచివాలయం సందర్శన

సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని కొసమాల సచివాలయాన్ని ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా శనివారం సందర్శించారు. ఈ మేరకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. అనంతరం ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న సిసి రోడ్లను పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపించకుండా చేయాలని ఇంజినీరింగ్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి పాల్గొన్నారు.

వివిఎం పరీక్షకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఎన్‌సిఇఆర్‌టి, విజ్ఞాన్ ప్రసార, ఎన్‌సిఎస్‌ఎం సంస్థలు సంయుక్తంగా గత నెలలో పాఠశాలల విద్యార్థులకు దేశవ్యాప్తంగా నిర్వహించిన విద్యార్థి విజ్ఞాన్ మంథన్ ప్రతిభా పరీక్షలో జిల్లాకు చెందిన నలుగురు విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ మేరకు విద్యార్థుల వివరాలను పరీక్షల నిర్వహణ జిల్లా సమన్వయకర్త ఎ.పున్నయ్య శనివారం వెల్లడించారు. నగరంలోని అందవరపు వరహ నర్సింహం మున్సిపల్ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని వి.హరిణి, ఆక్స్‌ఫోర్డ్ స్కూల్‌లో ఆరవతరగతి చదువుతున్న బలివాడ నవీన, సి.ఎల్.ఎన్. వైష్ణవి, ఏడో తరగతి చదువుతున్న జామి వేదశ్రీలు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. వందల సంఖ్యలో పరీక్షకు హాజరైన వారిలో నలుగురు ఎంపికకావడం గొప్ప విషయమన్నారు. నలుగురు విద్యార్థులు డిశంబరు 15న రాజమండ్రిలో జరిగే రాష్ట్ర స్థాయి శిబిరానికి హాజరవుతారన్నారు. ఎంపికైన విద్యార్థులను జిల్లా విద్యాశాఖధికారి ఎస్. తిరుమల చైతన్య, ఉప విద్యాశాఖాధికారి విజయ కుమారి, కౌశల్ కో-ఆర్డినేటర్లు మధుబాబు, ఉమేష్ కుమార్‌లు అభినందించారు.

ఎంపికైన విద్యార్థులు

సోమేశ్వరరావు మృతదేహం
(ఇన్‌సెట్‌లో సోమేశ్వరరావు ఫైల్)

అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి

మెళియాపుట్టి: మండలంలోని జోడూరు సమీపంలోని వంక మదుం వద్ద దుర్బలాపురానికి చెందిన యువకుడు కోటిలింగాల సోమేశ్వరరావు (32) శనివారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందారు. మృతుడు పలాసలోని ఓ ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తున్నాడు. బుధవారం విధి నిర్వహణకు వెళ్లాడు. రాత్రైనా ఇంటికి చేరకపోవడంతో తల్లిదండ్రులు కుమారుడికి ఫోన్ చేశారు. ఫలితం లేకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం వంక మదుం వద్ద వద్ద బైక్, మృతదేహం ఉందని స్థానికులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని శవపంచనామా నిర్వహి ంచి పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలిం చారు. ఎస్ఐ పి.రమేష్‌బాబు కేసుదర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి తల్లిదండ్రులు రాజేశ్వరి, మల్లేశ్వరరావు, సోదరుడు గోవిందరావు ఉన్నారు.

పుస్తెలతాడు చోరీ

కంచిలి: మండలంలోని తలతంపర పంచాయతీ పరిధిలోని సూదిపుట్టుగ వద్ద శనివారం మధ్యాహ్నం కవిటి మండలం ప్రగడ పుట్టుగకు చెందిన పురియా మానస మెడలో నుంచి రెండు తులాల పుస్తెలతాడు చోరీకి గురైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మానస తన తల్లి, కుమారుడితో కలిసి సోంపేట నుంచి స్కూటీపై తన పుట్టింటికి వెళ్తుంది. మార్గంమధ్యలో సూదిపుట్టుగా వద్ద గుర్తు తెలియని వ్యక్తి వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చి మానస మెడలో నుంచి పూసలతాడు తెంపి పట్టుకుని వెళ్లిపోయాడు. వెంటనే స్థానికులు గాలించినప్పటికీ దొంగతనం చేసిన వ్యక్తి ఆచూకీ లభించలేదు. సంఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్ఐ పేరినాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చైన్‌స్నాచర్ల హల్‌చల్

పలాస : కాశీబుగ్గ ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ సమీపంలో శనివారం ఉదయం చైన్ స్నాచర్లు హల్‌చల్ సృష్టించారు. రోటరీ నగర్‌కు చెందిన కొత్తకోట విజయలక్ష్మి నడుచుకుంటూ వెళ్తుంది. అటువైపుగా బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగుల్లో ఒకరు కిరాణా షాపుకు సిగరెట్ కోసం వెళ్లాడు. సిగరెట్ కొనుగోలు చేసి మహిళ మెడలో ఉన్న బంగారు పుస్తెలు తాడు లాక్కునేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. ఇరువురి మధ్య జరిగిన పెనుగులాటలో పుస్తెలు తాడు తెగి కింద పడింది. హఠాత్పరిణామానికి భయపడిన మహిళ దొంగ.. దొంగ అంటూ కేకలు వేయడంతో బైక్‌తో రెడీగా ఉన్న మరో దొంగతో కలిసి ఇద్దరూ బైక్‌పై పరారయ్యారు. సమాచారం అందుకున్న కాశీబుగ్గ సిఐ డి.మోహనరావు స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివరాలు సేకరిస్తున్న సిఐ మోహనరావు

తొమ్మిది ఇళ్లు దగ్ధం

ప్రజాశక్తి- జి.సిగడాం

మండలం సంతవురిటి పాత ఎస్‌సి కాలనీలో శనివారం అగ్ని ప్రమాదం సంభవించింది. కేతుబారికి సోములు భార్య దుర్గమ్మ వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు జరిగింది. దుర్గమ్మకు సరిగా కళ్లు కనిపించకపోవడం వలనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. గ్రామానికి చెందిన తలే సంతోష్ కుమార్, లండ లక్ష్మణరావు, కోడిగుడ్లు ఆదెమ్మ, కె.సోములు, కె.శంకరరావు, కె.అసరయ్య, కె.ఈశ్వరరావు, కె.దాలెమ్మ, కరజాడ ఈశ్వరరావులకు చెందిన తొమ్మిది తాటికమ్మలు ఇల్లు అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. ఇళ్లలో వంట సామాన్లు, నగదు, విలువుగల వస్తువులు కాలిబూడిదయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే కుమారుడు తేజాబాబు గ్రామానికి చేరుకుని ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకి ప్రభుత్వం నుంచి అన్ని విధాలా ఆదుకుంటామని ఎంపీ భరోసా ఇచ్చారు. ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు, బాధితులు ఊపిరి పీల్చుకున్నారు.

మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కృష్ణారావును సన్మానిస్తున్న యుటిఎఫ్ నాయకులు

పుస్తెలతాడు అప్పగింత

పలాస: కాశీబుగ్గకు చెందిన ఎన్.వి.కృష్ణారావు తనకు దొరికిన బంగారు పుస్తెల తాడు తిరిగి బాధితురాలకు అందజేసి తన నిజాయితీ చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే... వజ్రపుకొత్తూరు మండలం బైపల్లికు చెందిన దున్న పుష్పలత శుక్రవారం తన సొంత పనులు నిమిత్తం కాశీబుగ్గ వచ్చారు. మెడలో ఉన్న బంగారు పుస్తెలు తాడు తెగి పడిపోయింది. కాశీబుగ్గ బస్టాండ్ సమీపంలో అదే ప్రాంతానికి చెందిన ఎన్.వి.కృష్ణారావు బస్టాండ్ సమీపంలో బంగారు పుస్తెల తాడు దొరికింది. వెంటనే తన సామాజిక మాంధ్యంలో ప్రచారం చేశారు. పుష్పాలతది అని తెలుసుకొని పుస్తెల తాడు ఇచ్చి తన నిజాయితీ చాటుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న యుటిఎఫ్ నాయకులు అభినందనలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు లఖినాన వెంకటాచలం, ఇ.సిద్ధేశ్వరరావు, కంచరాన రమేష్, కంచరాన జయరాం, అప్పారావు, జగన్ పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

మాట్లాడుతున్న సిఐ శ్రీనివాసరావు

వెండి వస్తువులు రికవరీ

ప్రజాశక్తి- పోలాకి

ఇటీవల పోలాకి కేంద్రంలో సత్యసాయి మందిరంలో దొంగతానికి గురైన వెండి వస్తువులను రికవరీ చేశామని నరసన్నపేట సిఐ జె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు వెంబ వస్తువులను పోలీస్‌స్టేషన్‌లో శనివారం విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 20న పోలాకి సత్యసాయి మందిరంలో 480 గ్రాముల వెండి వస్తువులు, రూ.16,500 దొంగలు దొంగిలించారని ఆలయ నిర్వాహకులు బరాటం రామారావు ఫిర్యాదు శారని అన్నారు. ఈ ఫిర్యాదు మేరకు ఎస్ఐ జి.రంజిత్ దర్యాప్తు చేపట్టారని అన్నారు. శనివారం నరసన్నపేట హైవే బ్రిడ్జి పక్కన జమ్ము కూడలి వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న పొలమహంతి ప్రసాదరావుని అరెస్టు చేసి విచారణ చేపట్టామన్నారు. ఆయన 461 గ్రాముల వెండి వస్తువులైన కిరీటం, పంచపాత్ర, రుద్రాని, ప్లేటు తదితర వస్తువులను రికవరీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎఎస్ఐ ఆదినారాయణ, పిసి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ఊటలు ధ్వంసం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మెళియాపుట్టి మండలం నేలబంతులో శనివారం 1,400 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేసి 60 లీటర్ల నాటుసారాను పట్టుకున్నామని ఎక్సైజ్ సిఐ మీరా సాహెబ్ తెలిపారు. ఈ సందర్భంగా అక్రమంగా నాటుసారా తయారీ చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు సత్యనారాయణమూర్తి, గురుమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

పాతపట్నం : మండలంలోని చాపరాయిగూడలో ఎక్సైజ్ సిఐ కృష్ణారావు నాటుసారా తయారీ, విక్రయాలపై అవగాహన కల్పించారు. నాటుసారా తయారు తయారీ, వారికి సహకరించడం చట్టవిరుద్ధమని, దానివల్ల ఆరోగ్యానికి హానికరమని వివరించారు.

సామగ్రిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

పశువుల అక్రమ రవాణాపై కేసు నమోదు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టుకున్న పశువులు

పురపాలక సంఘం ఏడవ వార్డు పరిధిలోని చింతాడ సంత నుంచి మినీవ్యాన్‌లో అక్రమంగా పశువులను కబేళాలకు తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎ. సింహాచలం తెలిపారు. చింతాడ సంత నుంచి పాలకొండ వైపు మినీ వ్యాన్‌లో అక్రమంగా 11 పశువులను శ్రీకాకుళం రూరల్ మండలం చింతాడకు చెందిన బోర వెంకట సూర్యనారాయణ, బూర్జ మండలం కోనంపేటకు చెందిన గురుగుబెల్లి రాములు పశువులను అక్రమంగా తరలిస్తుండగా ఆమదాలవలస శివారున గల ఫ్లైఓవర్ బ్రిడ్జిపై పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మాట్లాడుతున్న కమిషనర్ ప్రసాదరావు

తడి చెత్త నుంచి ఎరువు తయారీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

స్వచ్ఛ సర్వేక్షన్ 2024 కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలో ప్రతి ఇంట్లో తడి చెత్తను సేకరించి ఇంట్లోనే ఎరువు తయారు చేసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు సూచించారు. నగరంలోని రైతు బజారు వద్ద గల మెప్మా రిసోర్సు సెంటర్‌లో మహిళలకు కంపోస్టింగ్ చెత్త డబ్బాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ చెత్త పార బోయకుండా ఇంట్లోనే ఎరువు తయారు చేసుకోవచ్చన్నారు. ఆదిశగా మహిళలకు అవగహన కల్పించడంలో మెప్మా అధికారులు ప్రత్యేక శ్రద్ద చూపాలన్నారు. అనంతరం అరసవల్లిలో దుకాణదారులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరసవల్లి క్షేత్రం పరిధిలో ఉన్న దుకాణ సముదాయాల్లో ప్లాస్టిక్ కవర్లు వినియోగించవద్దన్నారు.

ఎంపికైన విద్యార్థులతో విసి రజని

క్రీడా బృందాలు ఎంపిక

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

యూనివర్శిటీ స్థాయిలో జరగనున్న బాడ్మింటన్, వెయిట్ లిఫ్టింగ్ క్రీడల్లో డా.బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం తరుపున పాల్గొనేందుకు విద్యార్థినుల బృందాలను ఎంపిక చేశారు. కర్ణాటకలోని బెల్గారికు చెందిన విశ్వేశ్వరయ్య సాంకేతిక విశ్వవిద్యాలయంలో ఈ నెల 26 నుంచి 28 వరకు జరగనున్న బాడ్మింటన్ (మహిళల) బృందం తరుపున ఎల్.పార్వతి, వై. హేమ, కె.నాగమణి, ఎం.అశ్విణి, శెట్టి లిల్లీలు ఎంపికయ్యారు. అదే విధంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గుంటూరులో ఈ నెల 26 నుంచి 28 వరకు జరగనున్న సౌత్‌వెస్ట్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు డి.హేమశ్రీ, జి.వర్షిత, ఎస్.ఝాన్సీరాణిలను వర్శిటీ ఎంపిక చేసింది. ఈ విద్యార్థినుల బృందాలకు శనివారం వర్శిటీ విసి ఆచార్య కె.ఆర్. రజని ప్రత్యేకంగా అభినందనలు తెలిపి, విజేతలుగా తిరిగి రావాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.అనురాధ, స్పోర్ట్స్ డీన్ డా. పి.రవికుమార్, పీడీ డా.ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎపిఎం కుర్మారావును సన్మానిస్తున్న మహిళా సంఘాల ప్రతినిధులు

ఉత్తమ సేవలకు సత్కారం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో గతంలో మండలంలో విధులు నిర్వహించి ప్రస్తుతం మందస మండలానికి బదిలీపై వెళ్లిన ఎపిఎం పైడి కూర్మారావు, అలాగే ఇతర మండలాలకు బదిలీపై వెళ్లిన క్లస్టర్ కో-ఆర్డినేటర్ రామప్పడు, సుభద్ర, ఉమాలక్ష్మీలకు శనివారం పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని ప్రస్తుత ఎపిఎం గురుగుబెల్లి నారాయణరావు ఆధ్వర్యంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ గడచిన నాలుగేళ్ల మహిళా సంఘాలతో మమేకమై సామాజిక, ఆర్థిక పరిపుష్టికి ప్రభుత్వపరంగా వారికి దక్కాల్సిన అవకాశాలపై అవగాహన కల్పిస్తూ అందించడంలో ఉత్తమ సేవలు అందించారని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో అకౌంటెంట్ రోజా, డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్, మండల సమైక్య ప్రతినిధులతో పాటు క్లస్టర్ కోఆర్డినేటర్లు చంద్రరావు, రమణ, రోజాలత, సూర్యనారాయణ, మండల పరిధిలోగల విఓఎలు, గ్రామ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న జడ్జి మాధురి

మహిళల రక్షణ చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మహిళల రక్షణకు ఉన్న చట్టాలపై అవగాహన పెంచుకోవాలని పలాస సివిల్ కోర్టు న్యాయమూర్తి మాధురి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం విదాన్సే సమాధాన్ జాతీయ మహిళ కమిషన్, జాతీయ న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యాన శనివారం మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ, వారి హక్కులు సాధన కోసం అనేక చట్టాలు ఉన్నాయని అన్నారు. వాటిని మహిళలు ఎలా సద్వినియోగం చేసుకోవాలన్న అంశంపై లఘు చిత్రాల ద్వారా అవగాహన కల్పించారు. అలాగే ఉచిత న్యాయ సలహాలు కోసం టోల్ ఫ్రీ నంబరు 15100, అలాగే ఫిర్యాదు అందించేందుకు ఒన్ స్టాఫ్ సెంటర్ 181 కు సంప్రదించి న్యాయ సేవలు పొందాలని సూచించారు. అనంతరం మహిళలు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిఎస్‌పి ఎం.వెంకట అప్పారావు, సిఐ తిరుపతిరావు, తహశీల్దార్ సీతారామయ్య, ఎస్ఐ నిహార్, ఎంపిడిఒ రమేష్ నాయుడు, హరిప్రియ, సౌజన్య పాల్గొన్నారు.

దుకాణం ఏర్పాటుపై వివాదం

ప్రజాశక్తి- టెక్కలి

మండలంలోని సీతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ప్రహరీకి అనుకుని దుకాణం ఏర్పాటు వివాదాస్పదంగా మారింది. గ్రామానికి చెందిన ఓ గ్రూపు దుకాణం ఏర్పాటును ఏర్పాటుని వ్యతిరేకించగా, మరో గ్రూపు సహకరించారు. పాఠశాల ప్రహరీకి ఆనుకుని ఏర్పాటు చేస్తున్న దుకాణాన్ని ప్రధానోపాధ్యాయులు సత్తారు వేణీకుమారి కూడా వ్యతిరేకిస్తూ... పోలీసులు, రెవెన్యూ అధికారులకు శనివారం ఫిర్యాదు చేశారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు చేరుకుని దుకాణం యజమానితో మాట్లాడి తొలగించాలని ఆదేశించారు.

ప్రభుత్వరంగ సంస్థల కమిటీ సభ్యులుగా ఎన్ఇఆర్

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ప్రభుత్వ రంగ సంస్థల కమిటీలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావుకు సముచిత స్థానం దక్కింది. ఎపిలో ప్రజా పద్దుల కమిటీ (పిఎసి), అంచనాల కమిటీ(పిఇసి), ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ (పియుసి)లకు సంబంధించిన ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించారు. కమిటీలకు ఎన్నికైన సభ్యుల వివరాలను స్పీకర్ అయ్యన్న పాత్రుడు ప్రకటించారు. ప్రభుత్వ రంగ సంస్థల కమిటీలో సభ్యులుగా ఎన్నికైనట్లు స్పీకర్ వెల్లడించారు.

వైసిపి ఇన్‌ఛార్జి రేసులో ప్రకాష్?

ప్రజాశక్తి- కవిటి

ప్రకాష్

2024 ఎన్నికల తర్వాత స్తబ్దతగా ఉన్న ఇచ్ఛాపురం నియోజకవర్గ వైసిపిని బలోపేతం చేసేందుకు అధిష్టానం పక్కా ప్రణాళికలతో ముందుకు వెళ్తోంది. ముఖ్యంగా ఎన్నికల్లో ఓటమి అనంతరం వైసిపి ఇన్‌ఛార్జి సాయిరాజ్ నియోజకవర్గానికి దూరంగా ఉండడం, జెడ్‌పి చైర్‌పర్సన్ జిల్లా కేంద్రానికే పరిమితమవడంతో ఈ స్తబ్ధత మరింత పెరిగింది. దీంతో ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నీతానై ముందుకు సాగుతుంటే, సీడాప్ మాజీ చైర్మన్ శ్యాం ప్రసాద్ రెడ్డి చాపకింద నీరులా తనపని తాను చేసుకుపోతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో మరికొద్ది రోజుల్లో నియోజకవర్గ ఇన్‌ఛార్జి నియామకం ఉంటుందన్న ప్రచారంతో ఆశావాహుల్లో గుబులు రేపుతోంది. అయితే ఈ విషయంలో అధిష్ఠానం మాత్రం పక్కాగా వ్యవహరిస్తూ, పెద్దల అభిప్రాయాలు తీసుకుంటూ నియోజకవర్గంలో ఈసారి పాగావేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. అందులో భాగంగానే ఈసారి యువకుడు, కవిటి వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్‌పై అధిష్ఠానం దృష్టి సారించినట్టు తెలుస్తోంది. అంతేకాకుండా ఈ విషయంపై ఇప్పటికే నియోజకవర్గ పెద్దలతో చర్చించినట్టు సమాచారం. ముఖ్యంగా ఎన్ని ప్రయత్నాలు చేసినా నియోజకవర్గంలో పార్టీ విజయం సాధించకపోవడంపై అధిష్ఠానం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. ఈసారి ఎలాగైనా గెలిచి తీరాలని దానికి ఇప్పటినుంచే సిద్ధం కావాలని కృత నిశ్చయంతో ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో నర్తు రామారావు ఎమ్మెల్సీగా వ్యవహరిస్తుండటం, సాయిరాజ్ నియోజకవర్గానికి దూరంగా ఉండడంతో ప్రత్యామ్నాయ మార్గాలను పార్టీ అన్వేషిస్తోంది.

విజయం సాధించేందుకు ఒక్క సామాజిక వర్గమే కాకుండా ఆర్థిక అంశాలను కూడా పార్టీ పరిగణనలోకి తీసుకుంటున్నట్టు సమాచారం. దీంతో అటు నలుగురితో కలిసిపోవడమే కాకుండా ఆర్థికంగా కూడా ముందువరుసలో ఉండే కడియాల ప్రకాష్ వైపే పార్టీ మొగ్గుతున్నట్టు తెలుస్తోంది. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన ప్రకాష్ ఆ తరువాత తన మామయ్య రామారావుతో కలిసి వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. అప్పటి నుంచి ఓవైపు మండలంలో పార్టీ కార్యకలాపాలు సాగిస్తునే నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. అలాగే యాదవ సామాజిక వర్గంలో పట్టున్న నాయకుడిగా పేరు తెచ్చుకున్న ప్రకాష్ సామాజిక వర్గాలకు అతీతంగా అభిమానులను సంపాదించుకున్నారు.

ముఖ్యంగా తన మామయ్య రాజకీయ అడుగుజాడల్లో నడుస్తూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ సిద్ధాంతాలు ప్రజల్లోకి తీసుకెళ్ళడమే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా విరివిగా పాల్గొంటున్నారు. ఇవన్నీ కలగలిసి అధిష్ఠానం దృష్టి ప్రకాష్ వైపు చూసేలా చేశాయని, తమ భవిష్యత్ నాయకుడు ప్రకాష్ అని ఆయన అభిమానులు ఖుషీ అవుతున్నారు. అదే నిజమైతే మరికొద్ది రోజుల్లో నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జిగా కడియాల ప్రకాష్ ప్రకటన లాంఛనమేనేమో.?

వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు స్థాపించాలి

ప్రజాశక్తి- మందస

అభిప్రాయాలను తెలుసుకుంటున్న నాయకులు

ఉద్దానం అభివృద్ధి చెందాలంటే జీడి కొబ్బరి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, అభివృద్ధి బోర్డులు ఏర్పాటు చేయాలని, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను స్థాపించాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనారి మోహనరావు, జీడి రైతు సంఘం కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఉద్దానంలో ఏర్పాటు చేయ తలపెట్టిన గ్రీన్ ఫీల్డ్ కార్గో ఎయిర్‌పోర్టు ప్రతిపాదిత, ప్రభావిత గ్రామాలైన బేతాళపురం, లక్ష్మీపురం, రాంపురం, ఉభయగంగువాడలు, చీపురుపల్లి, మెట్టూరు గ్రామాల్లో శనివారం పర్యటించి రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు, మహిళలు ముక్తకంఠంతో 'ఎయిపోర్టు వద్దు... మా జీవనాధార జీడి తోట భూములే మాకు ముద్దు' అని ముక్తకంఠంతో నివదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులను మభ్యపెట్టి మోసగించి బలవంతపు భూసేకరణ చేసి, కార్పొరేట్లకు కట్టబెట్టే చర్యలకు ప్రభుత్వం పూనుకుంటే రైతులు పక్షాన నిలబడి పోరాటం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షునిగా కిరణ్ కుమార్

ప్రజాశక్తి- కవిటి

శ్రీకాకుళం జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడుగా మండలం కవిటి కొత్తూరుకు చెందిన డాక్టర్ పూడి కిరణ్ కుమార్ నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కరాజు రామారావు, యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఛార్జి మమత నాగిరెడ్డి చేతులమీదుగా శుక్రవారం ఆయన నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవం సాధించేందుకు తన శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు.

మాట్లాడుతున్న నాగేశ్వరరావు

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు నాగేశ్వరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అగ్రిగోల్డ్ యాజమాన్యం చేసిన ఆర్థిక మోసానికి భళై దశాబ్ద కాలంగా పోరాటాలు చేస్తున్న అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చొరవ చూపాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ముప్పాళ్లనాగేశ్వరరావు డిమాండ్ చేశారు. నగరంలో క్రాంతి భవన్‌లో అధ్యక్షులు జయసింహ అధ్యక్షతన శనివారం అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అగ్రిగోల్డ్ యాజమాన్యం ఆర్థిక మోసానికి పాల్పడి బోర్డు తిప్పేసిన సందర్భంలో ఎందరో బాధితులు మనోవేదనకు గురయ్యారని, వారందరి సమస్య పరిష్కారానికి ఏకతాటిపైకి వచ్చి అసోసియేషన్‌గా ఏర్పడి దశాబ్దకాలంగా అలుపెరగని పోరాటాలు చేయడం చారిత్రాత్మకమని అన్నారు. ఇప్పటివరకు రూ.10 వేలు, రూ.20 వేలు డిపాజిట్ దారులకు డబ్బులు అందాయని గుర్తు చేశారు. మిగతా డబ్బులు రావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, ఉపప్రధాన కార్యదర్శులు ఇ.వి.నాయుడు, వి.తిరుపతిరావు, డాక్టర్ బి.వి.చంద్రశేఖరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.గోవిందరావు, జిల్లా గౌరవాధ్యక్షులు సనపల నరసింహులు, మహిళా కార్యదర్శి ఆరెలమ్మ, జిల్లా కార్యదర్శి గంగు శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి లేఖ

ప్రజాశక్తి మందస

లక్ష్మణరావు

మండలంలోని తీర ప్రాంతాలైన గ్రామాలకు జీవనాధారమైన 1394 జీడి, మామిడి ఎకరాలు కార్గో ఎయిర్‌పోర్టు భూమి అవసరమని చెప్పడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని ఆర్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు మెంబర్ బత్తిన లక్ష్మణ్ తెలిపారు. ఈ మేరకు కేంద్ర పౌర విమానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు శనివారం లేఖ రాశారు. ఈ కార్గో ఎయిర్‌పోర్టు వద్ద ప్రజలకు ఉపయోగం లేదన్నారు. ఇక్కడ బడా పారిశ్రామిక వేత్తలకు, కాంట్రాక్టరలకు అప్పజెప్పూ... ఇక్కడ ఉన్న ఖనిజ సంపాదన దోచుకోవడం ప్రయత్నిస్తున్నారని అన్నారు. గ్రామాలపై అభిమానం ఉంటే సాగు, తాగునీరు అందించాలన్నారు. జీడి, కొబ్బరి బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. జీడికి మద్దతు ధర కల్పించాలన్నారు. లేకుంటే ప్రజా సంఘాల నాయకులతో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వాబ యోగిపై ఆగ్రహం

కవిటి: బెంతు ఒరియాల సమస్యలు పరిష్కరించాలంటూ శాసన మండలిలో మాట్లాడిన ఎమ్మెల్సీ నర్తు రామారావు తక్షణమే క్షమాపణలు చెప్పాలని, లేదంటే ఎమ్మెల్సీ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించిన ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగిపై నియోజకవర్గ బెంతు ఒరియాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కవిటి బస్టాండ్‌లో శనివారం నిర్వహించిన రిలే నిరాహారదీక్షల వద్ద బెంతు ఒరియాల ప్రతినిధులు రజనీ కుమార్ దళాయి, సుమన్ బిసాయి మాట్లాడారు. తెలిసీ తెలియని మాటలతో వాబ యోగి అనవసర ప్రేలాపన చేస్తున్నారని అన్నారు. అవసరమైతే తమతో బహిరంగ చర్చకు రావాలని హితవు పలికారు.

మాట్లాడుతున్న బెంతు ఒరియా ప్రతినిధులు

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి- కొత్తూరు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సిఐ చింతాడ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు స్థానిక వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రతి విద్యార్థి అపరిచిత వ్యక్తులు మొబైల్, ఆధార్, అకౌంట్, ఫోన్ నంబర్లను పంపించరాదని సూచించారు. వాట్సాప్ ద్వారా వచ్చే మెసేజులకు స్పందించరాదన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.కృష్ణారావు, ఎస్ఐ ఎం.ఎ.అమీర్ ఆలీ పాల్గొన్నారు.

టెక్కలి : విద్యార్థులు చదువుపై దృష్టిసారించి ఉన్నతస్థాయికి ఎదగాలని ఎస్ఐ రఘునాథరావు అన్నారు. మండలంలోని సీతాపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలు-నష్టాలు అనే అంశంపై శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్తారు వేణికుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మెళియాపుట్టి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు సైబర్ నేరాలపై సిఐ వి.రామారావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.రమేష్‌బాబు, ఎఎస్ఐ నర్సింగరావు, ప్రిన్సిపాల్ రాజేశ్వరి, మాధవరావు పాల్గొన్నారు.

పాతపట్నం : మండలంలోని సింగుపురంలో సైబర్ నేరాలపై ఎస్ఐ బి.లావణ్య అవగాహన కల్పించారు.

కొత్తూరు : మాట్లాడుతున్న సిఐ ప్రసాద్

పాతపట్నం : మండలంలోని తెంబూరులో సత్యసాయి బాబు జయంతి సందర్భంగా 300 మంది బాలవికాస్ విద్యార్థులతో కొవ్వొత్తుల కాంతులతో సంకీర్తన నిర్వహించారు. అనంతరం 3 వేల మందికి అన్నదానం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లోతుగెడ్డ తులసీ వరప్రసాద్, టిడిపి టౌన్ అధ్యక్షుడు సైలాడ సతీష్ పాల్గొన్నారు.

బూర్జ: మండలంలో లక్కుపురంలో శనివారం స్థానిక ఎస్ఐ ప్రవళ్లిక మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దని, గంజాయి వంటివి రవాణా చేసినా, వినియోగించినా చట్ట పరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. ప్రేమ పేరిట భవిషత్‌ను నాశనం చేసుకోవద్దని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా వుండాలని సూచించారు. ఆమెతో పాటు ఎంపిపి దీప, పోలీసు సిబ్బంది, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పలుచోట్ల అన్నదానం

పోలాకి : మండలంలో వెదుళ్లవలస, పోలాకి, డోల, పిన్నింటిపేట గ్రామాల్లో సత్య సాయిబాబా మందిరాల్లో సాయిబాబ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా యాత్రికులకు అన్నదానం నిర్వహించారు. అలాగే పోలాకిలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొన్నారు. అలాగే పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డిసిసిబి బ్యాంకు మాజీ చైర్మన్ డోల జగన్, టిడిపి మండల అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, భైరి భాస్కరరావు, లుకలాపు రాంబాబు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: స్థానిక సత్యసాయి మందిరంలో సత్యసాయిబాబా సేవాసమితి కన్వీనర్ సకాలాభక్తుల ఆనందరావు ఆధ్వర్యాన సత్యసాయిబాబా జయంతి సందర్భంగా అన్నదానం నిర్వహించారు.

పోలాకి : దుప్పట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

రామిడివలస తదితర గ్రామాల్లో సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి కర్నేన దీప ఆధ్వర్యంలో లక్కుపురంలో మహాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 2 వేల మంది యాత్రికులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి

ప్రజాశక్తి- లావేరు

సిఎం చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని లావేరు మాజీ ఎంపిపి డొకల తవిటమ్మ అన్నారు. మండలంలోని తాళ్లవలసలో పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా మంజూరైన సిసి రోడ్డు నిర్మాణ పనులను ఆమె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్ సహకారంతో తాళ్లవలస పంచాయతీ అభివద్ధి పథంలో ముందుకు సాగేందుకు పనులు ప్రారంభం అయ్యాయన్నారు. పంచాయతీలోని అన్ని గ్రామాల్లో ప్రణాళిక ప్రకారం పనులు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తాళ్లవలస మాజీ సర్పంచ్ ముప్పిడి మురళీమోహనరావు, టిడిపి నాయకులు దారపురెడ్డి కూర్మరావు, ముప్పిడి శ్రీనువాసరావు, జనసేన నాయకులు నాయుడు, కోటి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

కొత్తూరు : మండలంలోని కర్లెమ్మ పంచాయతీ నేతాజీనగర్‌లో రోడ్డు పనులను శనివారం సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్‌దాస్ నాయుడు శనివారం ప్రారంభించారు. సుమారు రూ.3.5 లక్షల నిధులతో సిసి రోడ్డు పనులు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల మాజీ అధ్యక్షులు ఎద్దు దాసునాయుడు, మాజీ సర్పంచ్ పడాల వెంకటకృష్ణ, ఎద్దు శ్రీను, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న మాజీ ఎంపిపి తవిటమ్మ తదితరులు

సెమీస్‌లో సాత్విక్-చిరాగ్ ఓటమి

చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ

షెన్‌జెన్(చైనా): చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. సెమీస్‌కు చేరిన డబుల్స్ జోడీ సాత్విక్-చిరాగ్ జంట ఫైనల్‌కు చేరడంలో విఫలమయ్యారు. శనివారం జరిగిన సెమీస్‌లో సాత్విక్-చిరాగ్ 18-21, 21-14, 16-21తో కొరియాకు చెందిన జిన్-సియో చేతిలో పోరాడి ఓడారు. ఈ మ్యాచ్ సుమారు గంటా 14నిమిషాలసేపు సాగింది.

పోరాడి ఓడిన తెలుగు టైటాన్స్

ప్రొ కబడ్డీ సీజన్-11

నోయిడా: ప్రొ కబడ్డీ సీజన్-11లో తెలుగు టైటాన్స్ వరుస విజయాలకు బ్రేక్ పడింది. రెండో సారి వరుసగా హ్యాట్రిక్ విజయాలతో దూసుకెళ్తున్న టైటాన్స్ శనివారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్ చేతిలో ఓటమిపాలైంది. చివరి పాయింట్ వరకు ఉత్కంఠభరితంగా జరిగిన పోటీలో తెలుగు టైటాన్స్ 28-31 పాయింట్ల తేడాతో పరాజయాన్ని చవిచూసింది. టైటాన్స్ రైడర్ విజయ్(15పాయింట్లు) సత్తా చాటగా.. ఆశీశ్(7) రైడ్‌లో, అంకిత్ ట్యాకిల్స్‌లో మెరిసారుగిక గుజరాత్ జట్టులో పార్థీక్(11), గుమన్(5)రైడ్స్‌లో రాణించారు. గుజరాత్ జట్టు రెండుసార్లు టైటాన్స్‌ను ఆలౌట్ చేయడంతో ఆ జట్టుకు విజయం దక్కింది. దీంతో టైటాన్స్ 13మ్యాచ్‌లు ముగిసేసరికి 43పాయింట్లలో 2వ స్థానంలోనే కొనసాగుతోంది.

విజ్ఞానయాత్రలో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులకు విజ్ఞాన యాత్ర

ప్రజాశక్తి- రణస్థలం

యూత్ క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇండియా లిటరసీ ప్రాజెక్టు బెంగుళూరు సహకారంతో నిర్వహించబడుతున్న స్కూల్ రెడీనెస్ అండ్ బాలవికాస్ ప్రోగ్రాంలో భాగంగా శనివారం రణస్థలం హైస్కూల్, కళాశాల బాలల సంఘ లీడర్స్ 34 మంది విద్యార్థులకు రణస్థలం ప్రభుత్వాసుపత్రి, ఫైర్ స్టేషన్, పోలీస్ స్టేషన్‌లకు విజ్ఞాన యాత్రకు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా పిల్లలకు ఆయా సంస్థల పనితీరు, వారు అందించే సేవలను పిల్లలకు వివరించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్స్ వై.శంకరరావు, ఎ.రమణమూర్తి, కె.శ్రావణి, ఐ.రాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

వాతావరణ మార్పులపై అవగాహన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యాన అతిథి ఉపన్యాస కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బారువ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర అధ్యక్షులు స్నేహలత వాతావరణ మార్పులు, మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. సెమిస్టర్‌లో మంచి మార్కులు సాధించేందుకు అవసరమైన మెళకువలు సూచించారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ రాబిన్ కుమార్ పాడి అధ్యక్షతన సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసరావు, దుర్యోధన, సంతోష్‌కుమార్, శివకుమార్, బృందావనం, న్యాయవాదులు సీతయ్యరెడ్డి, కృష్ణమూర్తిరెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.

కాలనీలో నిర్మాణం చేపడుతున్న సిసి రహదారి

ముమ్మరంగా సిసి రోడ్ల నిర్మాణం

పొందూరు: మండలం తుంగపేట బిసికాలనీలో సర్పంచ్ పప్పుల వేణుగోపాలం ఆధ్వర్యంలో సిసి రహదారులు, కాలువలు నిర్మాణాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా గ్రామంలో ఉపాధిహామీ నిధులు రూ.40 లక్షలతో పలుచోట్ల రహదారులు, కాలువలు నిర్మాణం చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు సర్పంచ్, కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

వనభోజనం ఐక్యతకు సోపానం

లావేరు : కార్తీక వనభోజనం కార్యక్రమం సామాజిక ఐక్యతకు సోపానమని రణస్థలం ఎంపిపి ప్రతినిధి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. శనివారం మండలంలోని అప్పాపురంలో గ్రామస్తులు నిర్వహించిన కార్తీక వనభోజన సమరాధన కార్యక్రమనికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు ఉమ్మడిగా ఒకదగ్గర కలిసి సహపంక్తి భోజనం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జగ్గురోతు సత్యనారాయణ, గ్రామపెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో యాత్రికుల కోసం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట లక్ష్మీ హోమ్స్ అధినేత పుట్ట ఫణికుమార్, శ్రీనివాసరావు, శ్రీలక్ష్మీ దంపతులు రూ.లక్షా 8 వేలు విరాళంగా అందజేశారు. శనివారం ఆలయాన్ని సందర్శించిన అనంతరం అనివేటి మండపంలో ఆలయ ఇఒ యర్రంశెట్టి భద్రాజీని కలిసి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ఎస్. కనకరాజు, ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఎస్ఐకి సన్మానం

కొత్తూరు : ఎం.ఎ.అహ్మద్ ఎస్ఐ వృత్తికి ఆదర్శమని సిఐ చింతాడ ప్రసాద్ అన్నారు. బదిలీపై వెళ్లిన ఎస్ఐకి శుక్రవారం రాత్రి దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎం.ఎ.యాసిన్, విశ్రాంత ఎఎస్ఐ శివారెడ్డి పాల్గొన్నారు.

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

బొబ్బిలి బ్రాంచ్, బలిజిపేట రోడ్డు, బొబ్బిలి, విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్-535558. ఫోన్: 08944-254205. ఇ-మెయిల్ ఐడి: iob0364@iob.in

ఋణగ్రహీతలు/హామీదారులు/తనఖాదారులుకు డిమాండ్ నోటీసు

సర్ఫేసీ చట్టం, 2002 నందలి సెక్షన్ 13, సబ్-సెక్షన్ (2) ప్రకారం జారీచేయబడినది

టు:

(1) వి2 ఆగ్రో టెక్ ప్రైవేట్ లిమిటెడ్, ప్లాట్ నెం.272, ఎపిఐఐసి గ్రోత్ సెంటర్, బొబ్బిలి, విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్-535558.

(2) వుల్లి గోవిందరావు, తండ్రి: లేటు వీర్రాజు, డోర్ నెం. 22-1-31, తెలగ వీధి, సాలూరు పోస్ట్, సాలూరు మండలం, పార్వతీపురం మన్యం జిల్లా-535591.

(3) వుల్లి దేవప్రసాద్, తండ్రి: లేటు వీర్రాజు, డోర్ నెం. 22-1-31, తెలగ వీధి, సాలూరు పోస్ట్, సాలూరు మండలం, పార్వతీపురం మన్యం జిల్లా-535591.

నెం.	ఋణ స్వభావం	లిమిట్ (రూ.లలో)	వడ్డీ రేటు (బకాయి వడ్డీ కలుపుకొని) & రెస్ట్స్	తేది.01.11.2024 నాటికి మొత్తం బకాయి*
1	CCPUB- 03640200000562	రూ. 40,00,000.00/-	15.40%	రూ. 28,58,045.75

మొత్తం బకాయి: రూ. 28,58,045.75 (అక్షరాల ఇరవై ఎనిమిది లక్షల యాభై ఎనిమిది వేల నలభై ఐదు రూపాయలు మరియు డభై ఐదు పైసలు) తేది 01.11.2024 నాటికి + అంగీకరించబడిన వడ్డీ రేటు ప్రకారం ప్రతి నెలవడ్డీని కలుపు విధముగా బకాయి మొత్తము చెల్లించు తేదీ వరకు జమకూడు వడ్డీతో కలిపి మొత్తము బకాయిని చెల్లించవలెను. NPA తేది: 14.10.2024. డిమాండ్ నోటీసు తేది: 08.11.2024

సెక్యూర్డ్ ఆస్తుల వివరములు:

విజయనగరం జిల్లా, బొబ్బిలి, ఎపిఐఐసి గ్రోత్ సెంటర్, సర్వే నెం. 27, ప్లాట్ నెం. 272 నందు 2117.42 చ॥మీ॥ / 2532.41 చ॥గ॥. హద్దులు : ఉత్తరం: ప్లాట్ నెం. 273/A, దక్షిణం: 20.00 మీ॥ వెడల్పు రోడ్డు, తూర్పు: 20.00 మీ॥ వెడల్పు రోడ్డు, పడమర: ప్లాట్ నెం. 264/A.

(1). సర్ఫేసీ యాక్ట్ (SARFAESI) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 నందలి సెక్షన్ 13(12) కు అనుబంధమైన నిబంధన 3 ప్రకారము సంక్రమించినఅధికారములతో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారుడు సెక్షన్ 13(2) ప్రకారం సదరు నోటీసు తేదీనుండి 60 రోజులలోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తమును మరియు దానిపై వడ్డీతో తిరిగి చెల్లించవలసినదిగా పైన పేర్కొనబడిన ఋణగ్రహీతలు/తనఖాదారులు/హామీదారులును కోరుతూ డిమాండ్ నోటీసులను జారీచేయడమైనది. (2). సదరు చట్టం ప్రకారం బ్యాంకు వారి వద్దనున్న సమాచారం మేరకు పైన పేర్కొనబడిన ఋణగ్రహీతలు/తనఖాదారులు/హామీదారుల చిరునామాలకు బ్యాంకు వారు పోస్టల్ డిపార్ట్‌మెంట్ నుండి తిరుగు రశీదుతో రిజిస్టర్డ్ పోస్టుద్వారా పంపించిన డిమాండు నోటీసు "పంపినవారికి వెనక్కి ఇవ్వబడినది" అనే రిమార్కుతో / మీరు తిరస్కరించడం వలన బట్వాడా కాకుండా తిరిగివచ్చినది. అందువల్ల ఈ పత్రికా ప్రకటన జారీ చేయడమైనది. మీకు పంపగా తిరిగి వచ్చిన ఒరిజినల్ డిమాండ్ నోటీస్‌ను మరియు పూర్తి సమగ్రవివరములను ఈ దిగువ సంతకందారైన అధీకృత అధికారి నుండి బ్యాంక్ పనిదినములలో పొందవచ్చునని సూచించడమైనది. (3). పైన పేర్కొనబడిన ఋణగ్రహీతలు/తనఖాదారులు/హామీదారులకు ఈ పత్రికా ప్రకటన ద్వారా మరొకసారి డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది. ఈ పత్రికా ప్రకటన ప్రచురణ తేది నుండి సదరు పైన తెలిపిన ఆస్తులను తనఖా/హామీగా పెట్టి, మీరు పొందిన ఋణము మొత్తములను మరియు దానిపై వడ్డీతో తిరిగి చెల్లించవలసినదిగా పైన పేర్కొనబడిన ఋణగ్రహీతలు/తనఖాదారులు/హామీదారులను కోరడమైనది. (4). సదరు పైన తెలిపిన ఋణగ్రహీతలు/తనఖాదారులు/హామీదారులు పైన తెలిపిన బకాయిని చెల్లించని యెడల ఎటువంటి తదుపరి ప్రకటన లేకుండా సెక్షన్ 13(4) క్రింద పైన తెలిపిన సెక్యూరిటీ SARFAESI చట్టంలోని నిబంధనలు అమలు చేసేందుకు, చర్యలు చేపట్టుటకు సెక్యూర్డు క్రెడిటార్ అగు దిగువ సంతకందారునకు అధికారం కలదు. (5). సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) చట్టప్రకారము ఋణగ్రహీతలు/తనఖాదారులు/హామీదారులు తమ తనఖా / హామీ పెట్టిన ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరు. (6). సదరు సర్ఫేసి చట్టం ప్రకారం, బ్యాంకు వారి వ్రాతపూర్వక అనుమతి లేకుండా పైన ఉదహరించిన స్థిరాస్తులను అమ్ముట ద్వారా గాని, లీజుకిచ్చుట ద్వారా గాని లేదా ఇతరములైన పద్ధతుల ద్వారా గాని ఇతరులకు బదిలీ చేయుట నిషేధించబడినది. పైన పేర్కొనబడిన చట్టములోని నిబంధనలకు అంగీకరించకపోవడం / అతిక్రమించడం వంటివి చేయడం సదరు చట్టములోని సెక్షన్ 29 ప్రకారం జైలు మరియు లేదా ఫైన్ ద్వారా శిక్షింపబడు నేరముగా పరిగణింపబడునని తెలియజేయటమైనది.

తేది: 08.11.2024, ప్రదేశం: బొబ్బిలి సం/- అధీకృత అధికారి, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్